ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

శుక్రవారం 2 మే 2025

# పెన్షన్.. పరేషాన్..

● ఒకరు చనిపోతే.. మరొకరికి పింఛన్



● జిల్లాలో బదిలీ అయిన 2,476 పింఛన్లు

● కొత్త పింఛన్ల కోసం నిరీక్షణ



అరు గ్యారంటీలకు దరఖాస్తులు చేసుకుంటున్న ప్రజలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వృద్ధాప్య పింఛన్‌దారులు ఒకరు చనిపోతే కుటుంబంలో భార్యకు గానీ, భర్తకు గానీ అర్హులైన ఇతరులకు పింఛన్ మంజూరుచేసే ప్రక్రియ మాత్రమే కొనసాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పింఛన్ల ఊసే ఎత్తడం లేదు. గత ప్రభుత్వం ఆసరా పథకం కింద పింఛన్లు అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటి స్థానంలో చేయూత పథకం ప్రకటించినా అర్హులకు నిరీక్షణ తప్పడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆరు గ్యారంటీలకు 1.92లక్షల దరఖాస్తులు వచ్చాయి. అందులో ప్రధానంగా పింఛన్ కోసం 76,501 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో చేయూత పింఛన్ కు 71,677 మంది, దివ్యాంగులు 4,824 మంది దర ఖాస్తులు చేసుకున్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల్లో ఒకటిగా ప్రకటించినా కాంగ్రెస్ పింఛన్ సొమ్ము సాధారణ పింఛన్‌దారులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని ప్రక టించినా అమల్లోకి రాలేదు. పెంచడంతో పాటు అర్హులైన వారందరికి పింఛన్లు మంజూరుచేస్తామని స్వీకరించిన దరఖాస్తులకు మోక్షం కలిగే తీరు మాత్రం కనిపించడం లేదు. దాదాపు 15నెలలు గడిచిపోయినా పింఛన్ల ఊసే ఎత్తడం లేదు.

**జిల్లాలో 1.17 లక్షల పింఛన్లు..**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం ప్రస్తుతం లక్షా 17వేల 902 పింఛన్‌దారులకు ప్రతినెలా రూ.25.84 కోట్లు పంపిణీ చేస్తోంది. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 31,870, దివ్యాంగుల పింఛన్లు 9,739, వితంతువు 24,007, చేనేత 3,518, గీతా కార్మికులు 2,255, ఒంటరి మహిళలు 1,808, బీడీ కార్మికులు 43,206, ఫైలేరియా 964, డయాలసిస్ పేషెంట్లు 65, బీడీ టేకేదార్లు 470 మంది ఉన్నారు.

**మూడేళ్లుగా ఎదురుచూపులు..**

జిల్లాలో పింఛన్ కోసం మూడేళ్లుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వం 2022లో ఒకసారి మాత్రమే కొత్తవారికి పింఛన్లు మంజూరు చేసింది. ఇందులో చాలా మందికి రాలేదని ఎదురుచూశారు. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన తరువాత దర ఖాస్తుల స్వీకరణతో హడావిడి చేసినా పింఛన్ మాత్రం అందడం లేదు. వృద్ధాప్య పింఛన్లు మాత్రం ఒకరు మరణిస్తే ఒకరికి అందిస్తున్నారు. ఇలా జిల్లాలో 2,476 మందికి మంజూరు చేశారు. అందులో బోయినపల్లిలో 195, చందుర్తిలో 210, ఇల్లంతకుంటలో 251, గంభీరావుపేటలో 221, కోనరావుపేట 230, ముస్తాబాద్‌లో 270, రుద్రంగిలో 59, తంగళ్లపల్లిలో 210, వీర్నపల్లిలో 45, వేములవాడలో 60, వేములవాడ రూరల్‌లో 132, ఎల్లారెడ్డిపేటలో 232, సిరిసిల్లలో 236, వేములవాడ మున్సిపాలిటీలో 125 బదలాయింపు పింఛన్లు మంజూరయ్యాయి.

**జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు మండలాల వారీగా**

| మండలం | పింఛన్‌దారులు |
|---|---|
| గంభీరావుపేట | 11,385 |
| ముస్తాబాద్ | 10,625 |
| సిరిసిల్ల మున్సిపల్ | 21,752 |
| తంగళ్లపల్లి | 10,454 |
| వీర్నపల్లి | 2,126 |
| ఎల్లారెడ్డిపేట | 11,212 |
| చందుర్తి | 7,003 |
| కోనరావుపేట | 9,282 |
| రుద్రంగి | 2,905 |
| వేములవాడ | 3,370 |
| వేములవాడ రూరల్ | 5,439 |
| వేములవాడ మున్సిపల్ | 7,236 |
| బోయినపల్లి | 6,824 |
| ఇల్లంతకుంట | 8,289 |
| మొత్తం | 1,17,902 |

## కుల గణనతో రోల్ మోడల్‌గా తెలంగాణ

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి) : కుల గణన కార్యక్రమం నిర్వహించడం ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికి అంతటికి రోల్ మోడల్‌గా నిలిచిందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కుల గణన కార్యక్రమం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని అన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయ కుడు రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జూడో యాత్ర సందర్భంగా దేశవ్యా ప్తంగా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేపడతామని స్పష్టం చేశారన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని తెలం గాణ ప్రభుత్వం కుల గణన నిర్వహించిందని, బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపి చట్టంగా మార్చి షెడ్యూల్ 9 లో చేర్చాలని కోరడం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ పోరాటం కారణంగానే దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆది శ్రీనివాస్ అన్నారు. కుల గణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ పార్టీ విజయంగా ఆయన అభివర్ణించారు.

## అదనపు ఎస్పీ, డీఎస్పీలకు ప్రశంస



ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీసు అధికారులతో ఎస్పీ మహేశ్ బి.గీతే

సిరిసిల్ల క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1,3 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లా నోడల్ అధికారి, అదనపు ఎస్పీ చంద్రయ్య, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ మురళీకృష్ణలను టీజీపీఎస్‌సీ చైర్మన్ ప్రశంసించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్ బి.గీతే ఇద్దరు అధికారులను అభినందించి వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో గ్రూప్ పరీక్షలు నిర్వహించారన్నారు.

## ఏఎస్పీని కలిసిన న్యాయవాదులు



వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

వేములవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు స్థానిక ఏఎస్పీ శేషాద్రినిరెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు కటకం జనార్ధన్, గుజ్జ మనోహర్, కని కరపు శ్రీనివాస్, జక్కుల పద్మ, బూర సరిత తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల త్యాగాలు వెలకట్టలేనివి..

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్ - సిరిసిల్లలో ఘనంగా మేడే వేడుకలు





మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సిరిసిల్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల త్యాగాలకు వెలకట్టలేనివని కార్మికుల పోరాట పటిమకు తార్కాణం మేడే నిలుస్తుందని ప్రణాళిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం సిరిసిల్ల లేబర్ అడ్డా వద్ద బీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ హక్కుల సాధన కోసం సాగిన పోరాటంలో అనేక మంది కార్మికులు అసువులు బాసిన రోజుగా మేడే నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు అడ్డగట్ల మురళి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బొల్లి రామ్మోహన్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## సప్లిమెంటరీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలకు కృషి

- ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రత్యేకాధికారి కే వసుంధర దేవి

ముస్తాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : సప్లిమెంటరీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రత్యేకాధికారి కె వసుంధరదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడారు. రెండు మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యపకులు, విద్యార్థులతో సమావేశాలను నిర్వహించి ఇంటర్మీడియట్ సప్లి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఇంటర్‌మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్, ప్రిన్స్‌పాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బీసీల పోరాటాలు ఫలించాయి..

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు

సిరిసిల్ల టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : బీసీల పోరాటాలు ఫలించడం వల్లే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మాండ్లు అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వీట్లను పంపిణ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో పర్శహన్మాండ్లు మాట్లాడారు. దేశవ్యాప్త కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బీసీ సంక్షేమ సంఘం స్వాగతిస్తుందన్నారు. కులగణన చేపట్టాలని దేశవ్యాప్తంగా పాదయాత్రలు చేస్తూ ప్రచారం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చిన రాహుల్‌గాంధీకి, కులగణన చేయాలని నిర్ణయం తీసుకున్న మోదికి ధన్యవాదాలు తెలిపారు. దేశంలోని ఓబీసీ సంఘాలు ప్రజాసంఘాల పోరాటం ఉద్యమాల వల్ల కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందన్నారు. బీజేపీ చరిత్రలో దేశవ్యాప్త కులగణన చారిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు. ఆలస్యం అయిన బీసీల చిరుకాల వాంఛ ఆచరణలోకి వస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనడం వల్లే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త కులగణను మొదలు పెట్టి వేగవంతంగా పూర్తి చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేని మల్లేశంగౌడ్, పట్టణ అధ్యక్షుడు కమలాకర్, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ సేవా పథకం ప్రారంభం

బోయినపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తడగొండలో బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభ వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె పి సునీతదేవి, మండల వ్యవసాయ అధికారి పి రాణి మాట్లాడారు. మే డే సందర్భంగా పరిశుధ్య కార్మికులను సన్మానించారు. పీఏసీఎస్ అధ్యక్షులు గుడి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి అరుణ్‌బాబు, పి మాధవి పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన న్యాయవాదులు



జస్టిస్ రాజేశ్వర్‌రావుకు ప్రసాదం అందజేస్తున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి నామవరపు రాజేశ్వర్‌రావును సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని హైకోర్టులో న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి శ్రీరాజరాజేశ్వరస్వామి చిత్రపటం, స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జె.శ్రీనివాసరావును, సచివాలయంలో న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతిని న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిరిసిల్లలో రూ.86.74కోట్లతో నిర్మించే న్యాయ నిర్మాణ్ నూతన భవనానికి వెంటనే టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించాలని, కరీంనగర్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కోర్టును విభజించి సిరిసిల్లలో నూతనంగా ఎస్సీ, ఎస్టీ కోర్టును ఏర్పాటుచేయాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వర్‌రావు, జస్టిస్ శ్రీనివాసరావులను, జూనియర్‌లకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని న్యాయశాఖ కార్యదర్శి తిరుపతిని న్యాయవాదులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి, ఉపాధ్యక్షులు ఎస్. అనిల్‌కుమార్, కోశాధికారి వేముల నరేశ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి నర్మెట్ట రమేశ్, గ్రంథాలయ కార్యదర్శి వుచ్చిడి శరత్‌రెడ్డి, మహిళా ప్రతినిధి ఎం. పుష్పలత, సీనియర్ న్యాయవాదులు జనార్ధన్‌రెడ్డి, అన్నల్‌దాస్ వేణు, కడగండ్ల తిరుపతి, బూర్ల కళ్యాణి, బి. అనీలలు పాల్గొన్నారు.

## కోవర్టు రాజకీయాలు మానుకోవాలి...

సిరిసిల్ల టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఏ పార్టీలో ఉన్నడో తెలియని వ్యక్తి చీటి ఉమేష్‌రావు కోవర్టు రాజకీయాలు చేయడం వల్లే సిరిసిల్ల నియోజకవర్గంలో ఈరోజు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇలా నెలకొందని కార్యకర్తలు భావిస్తున్నారని పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ, వివిధ మండలాల అధ్యక్షులు మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల చీత్కారానికి చీటి ఉమేష్‌రావు దూరమైన్నాడని అన్నారు. నాటి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన చీటి ఉమేష్‌రావును పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు. సిరిసిల్లలోనే విలేకరుల సమావేశంలో పార్టీకీ రాజీనామా చేస్తున్నానంటూ ప్రకటించాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైతే బలాన్ని పుంజుకుంటుందో కేవలం కోవర్టు రాజకీయాలు చేస్తూ బావ, బావమరుదుల మెప్పు పొందడానికి సిరిసిల్ల నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలోని కార్యకర్తల ఐక్యతను దెబ్బతీయాలని చూస్తున్నాడని ఆరోపించారు. మొన్న జరిగిన జిల్లా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడి ఎదుటనే కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ గెలువదంటూ మాట్లాడడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఐక్యం చేస్తూ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తూ ఉంటే ఓర్వలేక జిల్లా స్థాయి సమావేశంలో అధిక ప్రసంగం చేశాడని చీటి ఉమేష్‌రావుపై నిప్పులు చెరగారు. చీటి ఉమేష్‌రావు తీరుపై ఈ రోజు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌కు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులం అందరం కలిసి ఫిర్యాదు చేస్తున్నామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఎల్లా బాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు



విద్యార్థిని అర్పితను సన్మానిస్తున్న ఎంఈవో కృష్ణహరి





సిరిసిల్ల నెహ్రూనగర్ పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో అత్యంత ప్రతిభకనబర్చిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు దుమాల, అల్మాస్‌పూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను ఎంఈవో కృష్ణహరి, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు గురువారం అభినందించారు. మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, హెచ్ఎం గంగయ్య, ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీకాంత్, నాయకులు సుభాష్, షాదుల్, సంతోష్, రమణ, సందీప్, బాపురెడ్డి, శరవింద్, రాజు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని వెల్జిపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఉడుతల వెంకన్న, పాఠశాల కమిటీ చైర్మన్ దేశెట్టి పద్మ, ఉపాధ్యాయులు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం మల్యాల, బండపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పదవ తరగతి విద్యార్థులను గ్రామస్తులు గురువారం సన్మానించారు. 11 మంది విద్యార్థులకు హెచ్ఎం శరత్‌చంద్ర, ఉపాధ్యాయులు సన్మానం చేసి, జ్ఞాపికలు అందజేశారు. బండపల్లిలో ఎస్.మాధురి అనే విద్యార్థినికి పంచాయతీకార్యదర్శి రమేష్ రూ.5వేల చెక్కు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శరత్‌చంద్ర, ఉపాధ్యాయులు అమర్‌నాథ్, రవిందర్, ఝాన్సీ, మమత, లావణ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణులు కావడంతో గురువారం విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ, జిల్లా పాఠశాల పరీక్షల సహాయ కమిషనర్ చింతపల్లి వెంకటేశ్వర్‌రావులు అభినందించి నగదు పురస్కారాలు అందించారు. ఉపాధ్యాయులు గన్నమనేని శ్రీనివాసరావు, గుత్తికొండ రాజశేఖర్, కోడం భారతి, అడువ కీర్తి, విశ్వనాథుల శరత్‌బాబు, షేక్ ఖాజామోయినోద్దీన్, రోమాల లచ్చయ్య, ద్యావనపల్లి పరమేశంలు పాల్గొన్నారు.





మల్యాలలో విద్యార్థులను సన్మానించిన గ్రామస్థులు

## విగ్రహావిష్కరణ

కోనరావుపేట, మే 1 (ఆంధ్రజ్యోతి) : జనశక్తి మాజీ దళ నాయకుడు కాశవేణి మొండయ్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన కాశవేని మొండయ్య జనశక్తి దళ సభ్యుడుతో పాటు దళ నాయకుడిగా పనిచేసి జనజీవన స్రవంతిలో కలిశాడు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేశాడు. కరోనా సమయంలో కరోనా సోకి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తన జ్ఞాపకార్థం మొండయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయగా కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్యతో పాటు కుటుంబ సభ్యులు భార్య లక్ష్మి, కూతుర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొలనూరు ప్యాక్స్ చైర్మన్ కాశవేని మహేష్, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుకల తిరుపతి, మాజీ ఎంపీపీ అంజయ్య, కోనరావుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డి, సుద్దాల మాజీ సర్పంచులు కచ్చకాయల బాల్‌రెడ్డి, ఉప్పుల శంకర్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కచ్చకాయల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్ప కల్యాణం

చందుర్తి,మే 1 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో బీరప్ప కామరతి కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కళ్యాణ మహోత్సవంలో భాగంగా గురువారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు మ్యాకల గణేష్, మ్యాకల పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్, అర్చరీ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

సిరిసిల్ల టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం మినీస్టేడియంలో గురువారం వాలీబాల్, అర్చరీ వేసవి శిక్షణ క్రీడల శిబిరాన్ని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ ప్రారంభించారు. మొదటి రోజు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీబీఏ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్‌తో పాటు శిక్షకులు, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గోదాంకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు

● టెంట్లు, డెకోరేషన్ సామగ్రి దగ్ధం

● రూ.10లక్షలు వరకు నష్టం



కాలిపోయిన సీలింగ్ టెంట్లు, డెకోరేషన్ సామగ్రి


ధర్మపురి, మే 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పెద్దనక్కలపేటకు వెళ్లే దారిలో ఉన్న ఎండీ షబ్బీర్ గోదాంకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున నిప్పంటించారు. దీంతో గోదాంలో నిల్వ ఉంచిన టెంట్ హౌస్‌కు చెందిన టెంట్లు, సీలింగ్స్, డెకోరేషన్ సామగ్రి పూర్తిగా కాలిపోయింది. రూ 10 లక్షలు పైగా భారీ నష్టం వాటిల్లింది, వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రహమత్‌పురాకు చెందిన ఎండీ షబ్బీర్ పెద్దనక్కలపేట వెళ్లే దారిలో గోదాం గురించి ఒక గది కిరాయి తీసుకుని టెంట్ హౌస్‌కు సంబంధించిన టెంట్లు, సీలింగ్స్, డెకోరేషన్ సామాగ్రి కిరాయి ఇవ్వడం కోసం నిల్వ ఉంచారు. తెల్లవారుఝామున గోదాం ఎదురుగా కిరాణం షాపు నడుపుతున్న పోలవేని తిరుపతి సుమారు 3 గంటల సమయంలో నిద్ర లేచి చూసే సరికి టెంట్ హౌస్ గోదాం కాలిపోతుందని ఫోన్ చేసి షబ్బీర్‌కు తెలిపాడు. వెంటనే షబ్బీర్ అక్కడికి చేరుకుని ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేసి తెప్పించి మంటలను ఆర్పివేయించారు. గోదాంలో భద్రపరిచిన టెంట్లు, సీలింగ్ టెంట్లు (150), డెకోరేషన్, ప్లాస్టిక్ సామగ్రీ కాలి బూడిద అయ్యింది. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు. బాధితుడు ఎండీ షబ్బీర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## అబ్దుల్ కలాం విగ్రహంపై పట్టింపేది?



గుర్తుపట్టరాని విధంగా ఉన్న అబ్దుల్ కలాం విగ్రహం

తిమ్మాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విగ్రహం గుర్తుపట్టరాని విధంగా ధ్వంసమైంది. నిత్యం పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులు సైతం కలాం విగ్రహాన్ని పట్టించుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు కూడా పాఠశాల ఆవరణలోనే జరుగుతున్నా విగ్రహం వైపు కన్నెత్తిచూడక పోవడం శోచనీయం. పాఠశాల పరిసరాలు రాత్రయితే మందుబాబులకు అడ్డాగా మారుతాయి. దీంతో వారే విగ్రహం ధ్వంసం చేశారా.. లేదా ఇంకెవ రైనా చేశారా అనేది తెలియని పరిస్థితి. ఏది ఏమైనా స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు సైతం అబ్దుల్‌కలాం విగ్రహం పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అబ్దుల్ కలాం విగ్రహానికి మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# పని గంటలు లేని నేతన్నలు

ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు భరోసా..

సిరిసిల్లలో 30 వేల మరమగ్గాలు...

వస్త్ర పరిశ్రమలో 20 వేల మంది కార్మికులు, గార్మెంట్ రంగంలో 5 వేల మందికి ఉపాధి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మరమగ్గాలే వాళ్లకు లోకం. నిత్యం నేత పనిలోనే జీవితం. కానీ 8 గంటలకు బదులు 12 గంటలు ఉపాధి కోసం మరమగ్గాల చప్పుళ్ల మధ్య నలిగిపోతున్నారు. కూలి ఒప్పందాల సమయంలో కార్మికులకు 8 గంటల పనివిధానం అమలు చేస్తామని యాజమాన్యాలు రాసుకున్న ఒప్పందాలు అమలులోకి రాకుండానే పోయాయి. పని గంటల పరిమితి కోసం సాగిన పోరాటంలో కార్మికుల రక్తంతో తడిసి ఎగిరిన ఎర్రజెండాతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులు ఉపాధికోసం గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లను సాధించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ ఆర్డర్లకు ఇబ్బందులు ఏర్పడిన సందర్భంలోనూ కార్మికులు మళ్లీ రోడ్డెక్కడంతో ప్రభుతం బతుకమ్మ చీరల స్థానంలో స్వశక్తి మహిళలకు చీరలు ఇతర ఆర్డర్లను ఇచ్చి భరోసాను నింపింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల మరమగ్గాలు, డైయింగ్‌లు, సైజింగ్‌లు, వార్పిన్‌లపై 15 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న నేతన్న పథకాల పై ఎంతో ఆశగా నేత కుటుంబాలు ఉన్నాయి. మరోవైపు పని గంటల పరిమితి లేకపోవడంతోనే మానసికంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడుతున్నారు. కార్మిక సంఘాలు 8 గంటల పనివిధానం అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నాయి.

### ● నిత్యం బతుకు పోరాటం..

సిరిసిల్ల మగ్గం బతుకులు ఎప్పుడూ ఆగమాగమే. నిత్యం బతుకు పోరాటంగానే సాగుతుంది. పొద్దస్తమానం కష్టపడినా నేతన్నలు ఉపాధి కరువై అప్పుల్లో కూరుకుపోతూనే ఉన్నారు. పడుగు పోగులు, ఉరితాళ్లుగా వేలాడుతుంటే నిత్యం బతుకు చప్పుళ్ల వినిపించిన మరమగ్గాలు ఎప్పుడూ నేతన్నలు వెక్కిరిస్తూనే ఉంటాయి. ఈక్రమంలో నేతన్నలకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వ ఆర్డర్లు భరోసా కల్పిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అందిన ఆర్డర్లలో మార్పులు తీసుకవచ్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడంలో చేసిన జాప్యం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలోకి వెళ్లింది. దాదాపు 15 మందికి పైగా కార్మికులు ఉరి పోసుకున్నారు. వామపక్ష పార్టీలు, పవర్‌లూం కార్మిక సంఘాలు, వస్త్రోత్పత్తి దారుల సంఘాల ఆందోళనల ఫలి తంగా ప్రభుత్వం మళ్లీ స్వశక్తి మహిళల కోసం చీరల ఆర్డర్లు, విద్యార్థులకు యూనిఫాం బట్ట ఉత్పత్తి వంటివి ఇవ్వడంతో ఉపశమనం పొందారు. విద్యుత్ రాయితీ పది హెచ్‌పీల నుంచి 25 హెచ్‌పీలకు పెంచారు. కొంత బకాయిల సమస్య వెంటాడుతుంది. స్వశక్తి చీరలకు రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన యారన్ డిపో ఆధారంగా నిలిచింది.



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలో బీడీలు చుట్టే కార్మికులు, వస్త్రోత్పత్తి రంగంలో ఉన్న మహిళలకు గార్మెంట్ రంగంలో ఉపాధి కల్పించడానికి పూనుకుంది. ఆ దిశగానే సిరిసిల్ల శివారులోని సర్థాపూర్- పెద్దూర్‌ల వద్ద మహిళల కోసం గార్మెంట్ రంగంలో పరిశ్రమలు తీసుకవచ్చే దిశగా అపెరల్ పార్కు, పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే వర్కర్ టు ఓనర్ పథకం కోసం వీవింగ్ పార్కు, నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అపెరల్ పార్కులో వస్తున్న యూనిట్లతో మహిళలకు ఉపాధి లభిస్తుండగా వర్కర్ టు ఓనర్ పథకం కోసం నేతన్నలు ఎదురుచూస్తూ నిరాశ చెందుతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన వర్కర్ టు ఓనర్ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం, నిర్మాణం పూర్తిచేసుకున్న షెడ్లలో ఇతర సంస్థలకు లీజుకు ఇవ్వడంతో పవర్‌లూం కార్మికుల్లో పథకంపై ఆశలు సన్నగిల్లాయి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.386.88 కోట్లతో పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే పథకాన్ని అమలుచేయడానికి సన్నాహాలు ప్రారంభించడంతో కార్మికుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ యాక్షన్ ప్లాన్ ఎంటో కనిపించకపోవడంతో ఎదురుచూపులే మిగిలిస్తున్నాయి.

### ● 'వర్కర్ టు ఓనర్'కు రూపకల్పన

మరమగ్గాల కార్మికులను యజమానులుగా మార్చే దిశగా వర్కర్ టు ఓనర్ పథకాన్ని రూపకల్పన చేశారు. ఇందుకు అనుగుణంగా జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు వద్ద వీవింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. 42 వీవింగ్ షెడ్లు నిర్మాణం జరిగింది. ఇందులో కార్మికులకు మొదటి విడతలో 4416 మరమగ్గాలను గ్రూప్ షెడ్ల కింద అందించనున్నారు. ఒక్కో కార్మికుడికి 800 చదరపు అడుగుల్లో స్టోర్ రూంతో కలిపి అందిస్తారు. ఇందులో నాలుగు సెమీ ఆటోమేటిక్ మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రం, ఇస్తారు. పార్కులో 60 వార్పిన్ మిషన్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్ ధర రూ.8 లక్షలుగా ముందుగా నిర్ణయించారు.

ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.16.52 లక్షల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఇందులో 10 శాతం లబ్ధిదారుడి వాటాధనం, 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండే విధంగా పథకానికి రూపకల్పన చేశారు. సిరిసిల్లలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేస్తున్న వీవింగ్ పార్కులో కొందరికే మరమగ్గాల యూనిట్లు దక్కే అవకాశం ఉండడంతో మిగతా కార్మికులు నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో జియోట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 30,352 ఉన్నాయి. వీటిపై 6,500 మంది పని చేస్తున్నారు. అనుబంధ పరిశ్రమల్లో మరో 6 వేల మంది వరకు పనిచేస్తున్నారు. ప్రభుత్వం మొదటి దశలో కేవలం 1,104 మందికే యూనిట్లను అందించడంతో మిగతా కార్మికులు నిరీక్షించే పరిస్థితి ఉంది.

### గార్మెంట్ రంగంలో మహిళా కార్మికులకు ఉపాధి..

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నేపథ్యంలో సిరిసిల్ల పెద్దూర్ శివారులో మహిళా కార్మికుల కోసం 60 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ రూ.174 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లను కేటాయించారు. అపెరల్ పార్కులో గార్మెంట్ రంగంలో మహిళలకు ఉపాధి లబిస్తుంది. అపెరల్ పార్కులో 2021 ఏప్రిల్‌లో గోకుల్‌దాస్ ఇమేజ్ గార్మెంట్ సంస్థ యూనిట్‌ను ప్రారంభించింది. 800 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ ప్రారం భించిన యూనిట్‌ను 1600 మందికి ఉపాధి కల్పించే దిశగా విస్తరించింది. సిరిసిల్ల నుంచి నేరుగా అమెరికా లాంటి దేశాలకు రేడీమేడ్ వస్త్రాలు ఎగుమతి చేస్తుంది. ఇదేదిశగా బెంగు ళూరుకు చెందిన అంత ర్జాతీయ గార్మెంట్ రంగసంస్థ టెక్స్‌పోర్టు కంపెనీ యూనిట్‌ను ప్రారంభించింది. ఈ కంపెనీ ద్వారా 2వేల మందికి ఉపాధి లభించనుంది.



## జ్వరంతో మహిళ మృతి



కనకలక్ష్మి(ఫైల్)

ఓదెల, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నాగపూరి కనకలక్ష్మీ(70) అనేమహిళ గురువారం జ్వరంతో మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతవారం ఇంటివద్దనే కనకలక్ష్మికి మెదడు వాపుతోపాటు తీవ్రమైన జ్వరం రావడంతో అస్వస్థతకుగురైంది. వెంటనే కరీంనగర్‌లోని ఓప్రైవేట్‌ఆస్పత్రికి ఆసుపత్రికి తరలించారు. అక్కడివైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగాగురువారం మృతిచెందింది.

## ఉప్పుమడుగు సహకార సంఘం కార్యదర్శిపై వేటు

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాయికల్ మండలం ఉప్పుమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సంఘ పాలకవర్గానికి ఆయన ఆదేశాలు జారీచేశారు. ఉప్పుమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీససౌకర్యాలు కల్పించకపోవడంతోపాటు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీలను ఏర్పాటు చేయకపోవడంతో వీరాపూర్ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీరాపూర్ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం, డీటీ గణేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి కుమార్‌లు గురువారం సందర్శించి ధాన్యం కొనుగోళ్ల చేపడుతామని తెలిపారు.

## షాపులోకి దూసుకెళ్లిన కారు..

● ధ్వంసమైన సామగ్రి

వేములవాడ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామంలో రోడ్డుపక్కన షాపులోకి కారు దూసుకువెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి గ్రామంలోని కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారి పక్కన ఉన్న షాపులోకి కారు వేగంగా వచ్చి దూసుకెళ్లింది. దీంతో షాపులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. షాపులోని సామగ్రి ధ్వంసమయ్యాయి. కారుడ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



సంపత్ (ఫైల్)

ఎలిగేడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బోనగిరి సంపత్(29) అనే యువకుడు మద్యానికి బానిసై ఉరి వేసుకొని మృతిచెందినట్లు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మద్యానికి బానిసై రోజూ మద్యం సేవిస్తుండగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. తాగుడు మానుకోకుంటే ఉండనని అతడిభార్య పుట్టింటికివెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సంపత్ మద్యంతాగి బుధవారంరాత్రి ఇంటి దాబాపై పడుకుంటానని చెప్పివెళ్లాడు. గురువారం తెల్లవారుజామున మృతుడితల్లి వెళ్లి చూసేసరికి డాబామీద బట్టలు ఆరవేసుకునే తీగకు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి తల్లి లక్ష్మిఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వడదెబ్బతో హమాలీ మృతి

మంథని, మే 1 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపాలిటీపరిధిలోని గంగాపురి గ్రామంలో వడదెబ్బతో పులి మణి(55) అనేహమాలీ గురువారం మృతిచెందాడు. ఉదయం గంగాపురిలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి హమాలీ పనికి వెళ్లి ఎండలో పనిచేయడంతో ఇంటికి వచ్చిన తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్సకోసం మంథనిలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి గోదావరిఖని ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమా రుడు, కూతురు ఉన్నారు.

## కుల బహిష్కరణ: కేసు నమోదు

ముస్తాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకోడ్ గ్రామంలో ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు కుల బహిష్కరణ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన వల్లపు గుట్టయ్యకు చెందిన భూమి పంచాయతీ విషయంలో కుల సంఘం చెప్పినట్లుగా గుట్టయ్య వినడం లేదని దీంతో అతన్ని బూతులు తిడుతూ కుల బహిష్కరణ చేశారన్న ఫిర్యాదు మేరకు సంఘం సభ్యుల మీద కేసు నమోదు చిసినట్లు ఎస్సై తెలిపారు.

## సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ భాగస్వాములు కావాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్

సిరిసిల్ల రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల20న చేపట్టే సార్వతికసమ్మెలో కార్మికులందరు భాగస్వాములు కావాలని, మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సీఐటీయూ జిలా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం 139వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని లేబర్‌అడ్డా, రైతుబజార్, మున్సిపల్ కార్యాలయం, జిల్లాఆసుపత్రి, నేహ్రూనగర్, చంద్రంపేట, గణేష్‌నగర్, బీవైనగర్ ఏరియాలల్లో సీఐటీయూ జెండాలను ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం బీవైనగర్‌లో చేపట్టిన బహిరంగ సభలో మేడే అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ మేడే అమరవీరులు సాధించిన హక్కులను నేటి కేంద్ర బిజెపి సర్కార్ హరించి వేస్తుందని ఆ హక్కుల రక్షణ కోసం మే20న జరుగు సార్వత్రికసమ్మెలో అన్నిరంగాల కార్మికులు, కష్టజీవులు భాగస్వాములుకావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు ఉదయం 10గంటలకు పనికి వెళ్లి సాయంత్రం 6గంటలకు ఇంటికి వస్తున్నారంటే కారణం నాడు మేడే కార్మికులు చిందించిన రక్తం నేనని అన్నారు. అందులో అధికారంలో ఉన్న బీజేపీ కార్మికులు పోరాడి సాధించుకుంటున్న ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ కార్పొరేట్ దిగ్గజాలకు కార్మికుల కష్టార్జితాన్ని దోచిపెడుతున్నారని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ సర్కారు ఒక కలం పోటుతో రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం పీఎఫ్ ఈఎస్‌ఐ వంటి కనీస హక్కులు కూడా లేవన్నారు. బీజేపీపాలిత రాష్ట్రం ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచిందన్నారు. మే20న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం చేస్తున్న సమ్మెతో మోదీ మెడలు వంచి కార్మికవర్గ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, మూషం రమేష్, అన్నల్‌దాస్ గణేష్, సూరం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, రాపెల్లి రమేష్, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, గుండు రమేష్, కుడిక్యాల కనకయ్య , బెజుగం సురేష్, ఎక్కల్‌దేవి జగదీశ్, ఉడుత రవి, బాస శ్రీధర్, స్వర్గం శేఖర్, సుల్తాన్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




సిరిసిల్లలో సీఐటీయూ బహిరంగ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్

## రీల్స్ చేస్తూ నీటిలో మునిగి యువకుడి మృతి



మహ్మద్ అర్బాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన మహ్మద్ అర్బాస్(20) అనే యువకుడు రీల్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు వాగునీటిలో మునిగి గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇద్దరు స్నేహితులతో కలిసి అర్బాస్ నగర శివారులోని మానేరువాగు నీటిలోకి దిగి రీల్స్ వీడియో తీసుకుంటున్నారు. ఆ సమయంలో మరింత లోతుకు వెళ్లిన అర్బాస్ ప్రమాదవశాత్తుగా నీటిలోపడి మునిగిపోయాడు. స్థానికుల సహాయంతో అర్బాస్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మూడు రోజులుగా చెట్ల పొదల్లో వృద్ధురాలు

● గమనించి అధికారులకు సమాచారం ఇచ్చిన యువకులు ● సఖి కేంద్రానికి తరలింపు



వృద్ధురాలిని సఖి కేంద్రానికి తరలిస్తున్న డీడబ్ల్యూవో నరేష్, స్థానిక యువకులు

గొల్లపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట-శంకర్రావుపేట గ్రామరెవెన్యూ పరిధిలోని సాంబశివునిబోరులో దారుణం చోటుచేసుకుంది. హృదయవిదారకమైనస్థితిలో ఓ వృద్ధురాలిని చెట్ల పొదల్లో వదిలివెళ్లడంతో మూడురోజులుగా అచేతన స్థితిలో చావుబతుకుల మధ్య కొట్టాడుమిట్టాడింది. అటువైపువెళ్లిన యువకులు వృద్ధురాలి దీనస్థితిని గమనించి జిల్లా సంక్షేమశాఖ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి బోనగిరి నరేష్ హుటాహుటిన సంఘటనస్థలికి వచ్చి వృద్ధురాలిని సఖికేంద్రానికి తరలించిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికయువకులు, సంక్షేమశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురాకు చెందిన వేల్పుల బూదవ్వ అనే వృద్ధురాలు మూడురోజుల క్రితం గొల్లపల్లి మండలం శ్రీరా ములపల్లె గ్రామంలోని ఐకేపీకేంద్రం వద్ద రాత్రి పొద్దు పోయాక ఒంటరిగా నడవలేనిస్థితిలో ఓ చోట అచేతన స్థితిలో పడిఉంది. గమనించిన స్థానిక యువకుడు ఎనుగుల మహేష్ ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డులోని ఫోన్‌నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారమందించాడు. వృద్ధురాలికి ఉన్న ఒక్కగానొక్క కూతురు ఫోన్‌ఎత్తి మాకేం సంబంధం లేదంటూ ఫోన్ కట్‌చేసింది. మూడురోజుల అనంతరం శంకర్రావుపేట-మల్లన్నపేట గ్రామాల రెవెన్యూ సరిహద్దులోని సాంబశివుని గుట్టకు ఉన్న చెట్లపొదల మధ్య దీనమైనస్థితిలో పడి ఉండడాన్ని కొందరు అటుగా వెళ్లిన యువకులు గమనించి శ్రీరాములపల్లెకు చెందిన బీఆర్ఎస్ యువనాయకులు సల్లూరి శోభన్‌గౌడ్‌కు సమాచా రమందించారు. మరికొందరు యువకులు, స్థానికులతో కలిసి బుధవారం రాత్రి సాంబశివుని బోరుకు చెట్లపొదల్లో వృద్ధురాలి ఆచూకీ కోసం గాలించి ఎట్టకేలకు గుర్తించి జిల్లా సంక్షేమశాఖ అధికారికి సమాచారమందించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేష్ తన సిబ్బందితో తరలివచ్చి వృద్ధురాలిని జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించిన అనంతరం సఖి కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం వృద్ధురాలి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

పూర్తిగా నడవలేనిస్థితిలో ఉన్న వృద్ధురాలు శ్రీరాములపల్లె ఐకేపీ కేంద్రం నుంచి సుమారు 2కిలోమీటర్ల దూరంలోఉన్న సాంబశివుని బోరుకు ఎలా వెళ్లిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. వృద్ధురాలి కూతురు తన భర్త, పిల్లలతో కలిసి గుట్టబోరుకు వదిలివెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీడబ్ల్యూవో బోనగిరి నరేష్, ఎఫ్ఆర్‌వో మతులాపురం కొండయ్య, డీసీపీవో హరీష్, జెండర్ స్పెషలిస్ట్ బోయపోతు గౌతమి, సఖి కేంద్రం సిబ్బంది రజిత, స్థానికులు సల్లూరి శోభన్ గౌడ్, శ్రీకోటి రఘుపతి, గడ్డం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఉన్న భూమి లాక్కుని వృద్ధురాలి గెంటివేత

వేల్పుల బూదమ్మకు ఇస్లాంపురాలో సొంత ఇల్లుతోపాటు ఎకరం వ్యవసాయ భూమి ఉండగా జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో ఉంటున్న కూతురు ఇటీవలే భూమని తన పేరిట బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా 15 రోజుల అనంతరం వృద్ధురాలిని చితకబాది ఇంటిలో నుంచి గెంటివేయడంతో వృద్ధురాలు మతిస్థిమితం కోల్పోయి బయటికి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. శ్రీరాములపల్లె యువకుడు వృద్ధురాలి ఆచూకీ తెలపడంతో రాత్రిపూట వచ్చి గుట్టబోరుకు వదిలివెళ్లినట్లు అధికారులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## ఎనిమిదో రోజుకు స్వర్ణకారుల రిలేదీక్షలు

● మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



ముస్తాబాద్‌లో స్వర్ణకారుల రిలేదీక్షకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ముస్తాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ ఎదుట కొనసాగుతున్న స్వర్ణకారుల రిలే దీక్షలు గురువారం ఎనిమిదో రోజుకు చేరాయి. దీక్షలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో నాయకులు సంఘీభావం తెలిపారు. కుల వృత్తులను కాపాడుకోవాలని, చేతివృత్తుల మీద జరుగుతున్న దాడికి నిరసనగా రిలే దీక్షలు జరగుతున్నాయన్నారు. స్థానికంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న జ్యువెలరీ షాప్‌ను పెట్టవద్దని షాప్‌ను పెట్టడం ద్వారా స్వర్ణకారుల ఉపాధి దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారులు చింతోజు బాలయ్య, రాజు, ఈశ్వరయ్య, రవి, సత్యం, రఘు, వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జెల రాజు గుండెల్లి శ్రీనివాస్, దీటి నర్సింలు, ఉచ్చిడి బాల్‌రెడ్డి, రంజాని నరేశ్, మిరుదొడ్డి భాను తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యం, ఒంటరితనం భరించలేక ఆత్మహత్య

వీణవంక, మే 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఒంటరితనం భరించలేక వీణవంక మండలం బొంతుపల్లి గ్రామానికి చెందిన కేంశెట్టి మహేష్(57) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహేష్ కొంతకాలంగా ఒంటరిగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సునీల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ శోభాయాత్ర



ముత్యంపేటలో పెద్దమ్మతల్లి శోభాయాత్రను నిర్వహిస్తున్న గ్రామస్థులు

మల్లాపూర్, మే, 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యంపేట గ్రామంలోని పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం జాతరలో భాగంగా పెద్దమ్మతల్లి విగ్రహాన్ని శోభ యాత్రగా ఆలయానికి ఘనంగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో భక్తులు అమ్మ వారిని డప్పు చప్పుల్ల మధ్య శోభ యాత్రగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు తదితరులు పాల్గొన్నారు. జాతర వేడుకలు ఈనెల 4వ తేదీ వరకు ఘనంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

## భూమి ఆక్రమించారని రైతు ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన పడిగెల మల్లారెడ్డి(45) అనేరైతు భూమిని కొంత మంది వ్యక్తులు ఆక్రమించారని మన స్థాపానికి గురై పురుగులమందు తాగి గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పోరండ్ల గ్రామానికి చెందిన మల్లారెడ్డిని అతడి భార్య అనూషను అదే గ్రామానికి చెందిన పడిగెల గంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజిరెడ్డి, రాజవ్వ, రమ అనే వ్యక్తులు గత కొంతకాలంగా ఇష్టం వచ్చినట్లు తిట్టడమే కాకుండా, పోరండ్ల గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద గల భూమిని మల్లారెడ్డి ఈనెల 27వ తారీఖున చదునుచేయుటకు వెళ్లగా ఆరుగురు వ్యక్తులు మల్లారెడ్డిని భూమివద్దకు వస్తే చంపేస్తామని బెదిరించారు. దీంతో అప్పటినుంచి మనస్థాపానికి గురైన మల్లారెడ్డి గురువారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సాయంత్రం మల్లారెడ్డి మృతిచెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

# మామిడి మార్కెట్‌లో ఫీజు ఎగవేత



జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ

- ప్రతి యేటా రూ. కోట్లలో వ్యాపారం
- మార్కెట్ ఆదాయం మాత్రం రూ. అరకోటి లోపే
- జగిత్యాల మామిడి మార్కెట్‌లో వ్యాపారుల గోల్‌మాల్
- కట్టడి చేస్తేనే మార్కెట్‌కు ఆదాయం

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మామిడి మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం కొనసాగుతోంది. వ్యాపారుల గోల్‌మాల్ వల్ల మామిడి సీజన్‌లో మార్కెట్ దాదాపుగా రూ. కోటిన్నరకు పైగా నష్టపోతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రతి యేటా రూ. వంద కోట్ల నుంచి రెండు వందల కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందన్న అంచనాలున్నాయి. కొన్ని సంవత్సరాలుగా మార్కెట్ కమిటీకి దాదాపుగా రూ. అరకోటి ఆదాయం మాత్రమే లభిస్తోంది. నిబంధనల ప్రకారం వ్యాపారులు నిర్వహించిన కొనుగోళ్లలో మార్కెట్ కమిటీకి ఒక్క శాతం ఫీజు రూపేనా చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్‌లో రూ. కోట్లలో వ్యాపారం నిర్వహిస్తున్నప్పటికీ మార్కెట్ ఫీజు మాత్రం అంతంతమాత్రంగానే చెల్లిస్తున్నారు. దీంతో మార్కెట్‌కు తగిన ఆదాయం రావడం లేదు. గత 17 సంవత్సరాల క్రితం ఏర్పాటయిన జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌కు యేటా రూ. 50 నుంచి రూ. 60 లక్షల లోపు మాత్రమే ఆదాయం వస్తోంది.



విక్రయానికి వచ్చిన మామిడి కాయలు

### జగిత్యాలలో మామిడి మార్కెట్ పరిస్థితి ఇలా

జగిత్యాల శివారులోని చల్‌గల్ మామిడి మార్కెట్‌ను 2005 సంవత్సరంలో సుమారు 23 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. గత యేడాది రూ. 10 కోట్లు వెచ్చించి యార్డులో మామిడి మార్కెట్‌కు అవసరమైన షెడ్డులను నిర్మించారు. మామిడి కాయల కొనుగోలుకు యార్డు పరిధిలో 88 మంది కమీషన్ ఏజంట్లు, 59 మంది అడ్తి వ్యాపారులు న్నారు. దీనికి తోడు ఎటువంటి లైసెన్సులు లేకుండా సుమారు పాతిక మంది వరకు వ్యాపారం నిర్వహి స్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతి యేటా జగి త్యాల మామిడి మార్కెట్‌కు సుమారు 5 వేల మంది కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారన్నారు. వ్యాపారులు ప్రతి సీజన్‌లో సుమారు రూ. 100 కోట్ల నుంచి రూ. 200 కోట్లకు పైగా టర్నోవర్ చేస్తుంటారు.

### ఇతర రాష్ట్రాలకు మామిడి తరలింపు

జగిత్యాల నుంచి మామిడి కాయలను ఢిల్లీ, జమ్మూ, కశ్మీర్, చండీఘడ్, హర్యానా, పంజాబ్, నాగ్‌పూర్ వంటి రాష్ట్రాలకు లారీల్లో తరలిస్తుంటారు. ప్రతి నిత్యం 20 నుంచి 30 లారీల్లో మామిడికాయలు వివిధ ప్రాంతాలకు తరలిపోతుంటాయి. పెద్ద లారీల్లో సుమారు 12 నుంచి 15 టన్నుల మామిడి కాయలను తరలిస్తుంటారు. గత నాలుగు, ఐదేళ్లగా సగటున టన్నుకు రూ. 30 వేల వరకు మామిడి ధర పలికింది. టన్నుకు రూ. 30 వేల చొప్పున 15 టన్నులకు రూ. 4.50 లక్షలు అవుతోంది.

వ్యాపారులు మార్కెట్‌కు ఒక్క శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో లారీకి రూ. 4,500 ఫీజు చెల్లిం చాలి. ప్రతి రోజు 30 లారీల్లో మామిడి కాయలు తరలితే సుమారు రూ. 1.62 లక్షలు ఫీజు రూపేనా మార్కెట్‌కు ఆదాయం రావాల్సి ఉంది. దాదాపుగా నాలుగు నెలల పాటు మామిడి మార్కెట్ కొనసాగుతోంది. ఈ లెక్కన రూ. కోటిన్నరకు పైగా మార్కెట్‌కు మామిడి వ్యాపార ఆదాయం చేకూరాలన్న అంచనా ఉంది. దీనికి తోడు మామిడి కాయ ధరలు పెరిగిన సందర్భాల్లో దాని ప్రకారం ఫీజు అధికారులు వసూలు చేయాలి. కాగా వ్యాపారులు అధిక రేటుకు మామిడి కాయలు కొనుగోలు చేసినప్పటికీ తక్కువ రేటుకు కొనుగోలు చేశామని గోల్‌మాల్ చేస్తూ ఆ మేరకు మాత్రమే అధికారులకు మార్కెట్ ఫీజు చెల్లిస్తున్నారు. అధికారులకు పరిస్థితి తెలిసిన ప్పటికీ చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా మార్కెట్ ఆదాయం కోల్పోవలసి వస్తోంది.

### అంతంతమాత్రంగానే ఆదాయం

జగిత్యాల మామిడి మార్కెట్‌లో గత యేడాది రూ. 63.29 లక్షల ఫీజు మాత్రమే వసూలైంది. 2022-23 సీజన్‌లో రూ. 43.28 లక్షలు ఫీజు వసూలైంది. అదే విధంగా 2021-22 సంవత్సరంలో రూ. 60.90 లక్షలు, 2020-21 సంవత్సరంలో 91.70 లక్షలు, 2019-20 సంవత్సరంలో రూ. 69.65 లక్షలు, 2018-19 సంవత్సరంలో రూ. 64.01 లక్షలు, 2019-18 సంవత్సరంలో 71.89 లక్షలు మార్కెట్ ఫీజు వసూలు అయినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. మార్కెట్ లైసెన్స్ తీసుకోవడానికి, నిర్ణీత ఫీజు చెల్లించడానికి వ్యాపారులు పెద్దగా ఆసక్తిచూపడం లేదు.

### నోటీసులు జారీ చేసినా రాని ఫలితం

మార్కెట్ యార్డులకు రైతులు తీసుకొని వచ్చిన పంట ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు చేపట్టే లావాదేవీల ఆధారంగా మార్కెట్ యార్డుకు సెస్ చెల్లిస్తారు. మార్కెట్ ఫీజు చెల్లింపు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. గత యేడాది యార్డులో ప్రారంభించిన షెడ్లలోనే మామిడి కాయల కొనుగోళ్లు జరపాలని, యార్డు వెలుపల క్రయ విక్రయాలు జరిగితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ కొందరు వ్యాపారులు పట్టించుకోకుండా యార్డు వెలుపలనే కొనుగోళ్లు ప్రారంభించారు. అధికారులు నోటీసులు జారీ చేసినా ఫలితం రావడం లేదు. మార్కెట్ ఫీజు ఎగవేయడానికే వ్యాపారులు ఎత్తులు వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకొని ఆదాయానికి గండి పడకుండా చూడాల్సిన అవసరముందని రైతులు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం

**ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జగిత్యాల**



జగిత్యాలలోని మామిడి మార్కెట్‌లో వ్యాపారులు మార్కెట్ ఫీజు చెల్లించేలా పకడ్బందీ చర్యలు తీసు కుం టాం. మార్కెట్ ఆదాయానికి గండి కొట్టే వ్యాపా రులను గుర్తిస్తాం. ఎప్పటికప్పుడు క్రయవిక్రయాల పై పర్యవేక్షణ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటాం.

## ఇటలీ వధువు.. వేములవాడ వరుడు..

- సంప్రదాయ పద్ధతిలో ఘనంగా వివాహం



నూతన జంటను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇటలీ దేశానికి చెందిన యువతి.. వేములవాడకు చెందిన యువకుడు హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన ఓలిమినేని నిత్యానందరావు-వీణారాణి దంపతుల కుమారుడు శ్రీకర్‌రావు ఫ్రాన్స్ దేశంలో ఉన్నతవిద్య అభ్యసించాడు. ఆ క్రమంలో ఇటలీకి చెందిన వైద్యురాలు షెదిరికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. బుధవారం రాత్రి స్థానిక మహారాజ ఫంక్షన్‌హాల్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో వేద మంత్రాల సాక్షిగా వారిద్దరూ ఒకటయ్యారు. వివాహానికి వధువు తరపున ఇటలీనుంచి సుమారు 25మంది బంధుమిత్రులు హాజరయ్యారు. నూతనవధూవరులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీఎమ్మెల్యే రేగులపాటి పాపారావు తదితరులు ఆశీర్వదించారు.

## ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై

రాయికల్, మే 1 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమై నెల రోజులైనా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించడం లేదని జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన రైతులు గురువారం జగిత్యాల-రాయికల్ ప్రధాన రహదారిపై ఉప్పుమడుగు స్టేజీ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కోసి ధాన్యాన్ని కుప్పలు పోసి చాలా రోజులవుతున్నా అధికారులు కొనుగోళ్లు ప్రారంభించలేదని మండిపడ్డారు. అకాల వర్షాలు పడి ధాన్యం తడిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోయారు. వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్, తహసీల్దార్ ఖయ్యూం, ఎస్సై సుధీర్ రావులు చేరుకుని రైతులతో మాట్లాడి కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పి ఆందోళనను విరమింపజేశారు.

## శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చిరుతల రామాయణం కళాకారులు

వెల్గటూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం రాత్రి ముత్తునూరు గ్రామంలో ప్రదర్శించిన ఆధ్యాత్మిక కార్యక్రమం చిరుతల రామాయణం పట్టాభిషేకంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రేక్షకుల మధ్యన నాయకులతో కలిసి కూర్చుని చిరుతల రామాయణం లోని పాత్రలు, సన్నివేశాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం అడ్లూరి మాట్లాడుతూ రామాయణం గొప్పదనాన్ని, శ్రీరాముడి గొప్పదనాన్ని చిరుతల రామాయణం రూపంలో గ్రామీణ ప్రాంతం వారికి అర్థమయ్యే రూపంలో కళాకారుల ప్రదర్శించడం గొప్ప విషయం అన్నారు. కళాకారులకు పది వేల రూపాయాల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోల్ల తిరుపతి, అనుమాల మంజుల, సందీప్‌రెడ్డి, ఎలుక రాజు, శ్రీకాంత్‌రావు, తిరుమలేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదే

- ఎమ్మెల్సీ సురభి వాణిదేవి



దుద్దెనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

సైదాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదేనని ఎమ్మెల్సీ సురభివాణిదేవి అన్నారు. గురువారం సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, సోమారం, లక్ష్మన్నపల్లి, ఆరెపల్లి, ఎక్లాస్‌పూర్, దుద్దెనపల్లి గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశస్వాతంత్రం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లాంటి వారిని నేటియువత ఆదర్శంగా తీసుకొని స్వంతంగా ఎదుగుతూ దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. యువత మత్తుకు, మద్యానికి, ఇతర చెడు వ్యసనాలకు బానిసలై అర్థాంతరంగా చనిపోతున్నారన్నారు. రానున్న రోజుల్లో దేశంలో యువత యొక్క సంఖ్య గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందన్నారు. మనపిల్లలను చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా డ్రగ్స్ లాంటి మత్తు మహమ్మారిని మన గ్రామాల్లోకి రాకుండా పోరాటంచేసి యువతను కాపాడాలని మహిళలోకాన్ని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కుమార స్వామి, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, జేఏసీ కో-ఆర్డినేటర్ డ్యాగల సారయ్య, ఎదులాపురం తిరుపతి, చెప్యాల ప్రకాష్, మాట్ల వెంకటస్వామి, గాండ్ల పద్మ, జగదీష్, కుమారస్వామి, ఆశీర్వాదం, ప్రభాకర్, ప్రవీణ్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటిరెడ్డి, కుమారస్వామి, రాజిరెడ్డి, రాజయ్య, యుగందర్, రవీందర్, రాజేందర్, రజిత, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. మే డే సందర్భంగా సెలవురోజు కావడంతో రాజన్న ఆలయానికి భక్తులు తరలి వచ్చి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయం

## ఆలూరులో ఘనంగా పోచమ్మ బోనాలు

రాయికల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామంలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఇంటికో బోనంతో ఊరేగింపుగా తరలివెళ్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం వద్ద నైవేద్యాలు సమర్పించారు. అలాగే దావత్ పూజారులు మేకను గావుపట్టారు. పిల్లాపాపా, గొడ్డు గోదాను చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామనాయకులు, యువకులు తదిత రులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న పూజారులు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

## జాతీయ కవి సమ్మేళనానికి దేవానందం



దేవానందం

సిరిసిల్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో ఈనెల8న హైదరాబాద్, త్యాగరాయ గాన సభలో జరిగే జాతీయ కవిసమ్మేళనంలో సిరిసిల్లకు చెందిన ప్రముఖకవి బూర దేవనాందంకు కవితాగానం చేయడానికి ఆహ్వానించారు. తెలుగు భాషకు పట్టాభిషేకం పేరుతో నిర్వహించే భాష సదస్సు, కవిసమ్మేళనంలో కవి తను వినిపించనున్న దేవానందంను సిరిసిల్ల జిల్లా రచయితల సంఘం, జిల్లా మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, కవులు, రచయితలు అభినందించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కోర్కల్ గ్రామంలోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టాక్టర్ డ్రైవర్,ఓనర్ రావణ వేణి సదయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

## ప్రైవేటు యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలి



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి

గణేశ్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి): ఐకార్ నుంచి అనుమతులు లేకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వ అనుమతి ఉందనే పేరుతో నిర్వహిస్తున్న ప్రైవేటు యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలని యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి కోరారు. గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ యూనివర్సిటీల్లో అగ్రికల్చర్ కోర్సులను ఉన్నాయని చెబుతూ విద్యార్థులను, తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తూ అడ్మిషన్లు చేపడుతున్న కావేరీ యూనివర్సిటీ ఇతర ప్రైవేట్ యూనివర్సిటీల గుర్తింపు రద్దు చేయాలని, తక్షణమే కేసులు నమోదు చేయాలని అన్నారు. అనుమతులు తీసుకోకుండా విద్యార్థులను యూనివర్సిటీలో చేర్చుకోవడంతో చదువుల పూర్తయిన తర్వాత వచ్చే సర్టిఫికెట్‌తో ఎలాంటి ఉపయోగముండదన్నారు. భవిష్యత్‌లో ఉద్యోగాలకు అనర్హులుగా ఉంటారని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలన్నారు. అనంతరం సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ మాట్లాడుతూ దీనిపై తక్షణమే ఉన్నతాధికారులతో మాట్లాడి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు సుమన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసులపై దమనకాండను ఆపాలి

ఇల్లంతకుంట, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసుల హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ జిల్లా నాయకుడు మంద సుదర్శన్ అన్నారు. ప్రజల హక్కులను కాపాడతామని రాజ్యాంగంపై ప్రమాణం చేసిన నాయకులు అమాయక ప్రజల ప్రాణాలు తీస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. మేధావులు, విద్యావంతులు ఏకమై ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు.

## కాంగ్రెస్ అధ్యక్షుడికి కటకం పరామర్శ

గంభీరావుపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌ను మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం గురువారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో హమీద్ సోదరుడు జావీద్ మృతి చెందాడు. గంభీరావుపేటలోని హమీద్ నివాసంకు వెళ్ళి మృత్యుంజయం పరమర్శించి, ఓదార్చారు. హమీద్‌కు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ కోట లింగం తదితరులు ఉన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో కృష్ణహరి

ఎల్లారెడ్డిపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణహరి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని అన్నారు. ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

ఇల్లంతకుంట, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో శుక్రవారం నుంచి వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం అవుతుందని వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు తెలిపారు. ఈతరం యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో కబడ్డీ, వాలీబాల్ శిక్షణను ప్రతిరోజు ఇస్తామని తెలిపారు. ఈతరం యువజన సంఘం అధ్యక్షుడు గోవికారి నరేష్, ప్రధాన కార్యదర్శి ఎంద్ర సాయి గణేష్‌ల ఆధ్వర్యంలో సీనియర్ క్రీడాకారులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

## కార్యవర్గాల ఎన్నిక

ఎల్లారెడ్డిపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లోని మున్నూరు కాపు, శాలివాహన కుమ్మరి సంఘం కార్యవర్గాలను గురువారం ఎన్నుకున్నారు. నారాయణపూర్‌లో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా సూర నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా బొమ్మడి స్వామి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ప్రకాశ్, కోశాధికారిగా అశోక్, కార్యదర్శిగా కిషన్‌ని ఎన్నుకున్నారు. రాచర్లగొల్లపల్లిలో శాలివాహన కుమ్మరి సంఘం అధ్యక్షుడిగా దాసారపు చంద్రం, ఉపాధ్యక్షుడిగా శశికుమార్, కోశాధికారిగా శేఖర్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా మల్లయ్య, సత్తయ్యలను ఎన్నుకున్నారు. సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి పాటు పడుతామని నూతన అధ్యక్షులు నర్సయ్య, చంద్రం పేర్కొన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## దాతలకు ఘన సన్మానం

ఎల్లారెడ్డిపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శివాలయం మరమ్మత్తుకు గ్రానైటు సమకూర్చిన దాతలు ఎస్ఆర్ఐ రాధారపు సత్యం, సోమ్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు రవీందర్, భాస్కర్, కిషన్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, వెంకన్న, రాజయ్య, ఈశ్వర్, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోని రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ, ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిశారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి- అక్కపల్లి, మండల కేంద్రంలోని గిద్దె చెరువు నుంచి రాజన్నపేట, కోరుట్లపేట నుంచి సింగసముద్రం చెరువు మీదుగా సముద్రలింగాపూర్ వరకు రహదారుల నిర్మాణాలకు కృషి చేయాలని కోరారు. మంత్రి స్పందించి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్ళి, నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, రవీందర్‌లు ఉన్నారు.

## నిబంధనల ప్రకారమే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ

ముస్తాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారమే బేడబుడగ జంగాలకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యాయని సంఘం నాయకులు మోతె పెద్దవెంకటి, పర్వతం శ్రీనివాస్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ అవరణలో రాజీవ్ యువవికాసం పథకంలో భాగంగా షెడ్యూల్ కులాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొంత మంది దళిత నాయకులం అని చెప్పుకొని వాటిని అడ్డుకోవడం సరైన చర్య కాదని బేడబుడగ జంగం యూత్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి కడమంచి రవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రెవెన్యూ అధికారులు విచారణ చేసి ఇతర జిల్లాలో, ఇతర మండలాల్లో ఉన్న వారు రక్త సంబంధీకులే అని గుర్తించి పూర్తి స్థాయి ఆధారాలతో ఉన్నత అధికారులకు నివేదించారన్నారు. కొంత మంది స్వార్థం కోసం బెడబుడగ జంగాలను బెదిరించి ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. అభ్యంతరాలు ఉంటే చట్టపరంగా ఎదుర్కోవాలని సూచించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వీర్నపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో రూ. 45 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన అంకమల్ల రవి అనారోగ్యానికి గురి కాగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కును కాంగ్రెస్ నాయకులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షుడు సితార దేవరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు

సిరిసిల్ల టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిమ్‌లో వ్యాయామం చేస్తూ ప్రమాదవశాత్తు గాయపడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ త్వరగా కోలుకోవాలని గురువారం సిరిసిల్ల పట్టణంలోని భక్త హనుమాన్ దేవాలయంలో బీఆర్ఎస్ నాయకులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కంచర్ల రవిగౌడ్, మట్టె శ్రీనివాస్, ముగ్ధం అనిల్ పాల్గొన్నారు.

# ఊరూరా ఘనంగా మే డే వేడుకలు



సిరిసిల్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు



పెద్దలింగాపూర్‌లో జెండాను ఎగురవేస్తున్న నాయకులు



ఎల్లారెడ్డిపేటలో వేడుకల్లో పాల్గొన్న కార్మికులు




వేములవాడలో జెండా ఎగురవేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సిరిసిల్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): దోపిడి నిర్మూలనకు కార్మికులందరూ ఐక్యమై పోరాటం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పరకాల రవీందర్ కోరారు. మే డే సందర్భంగా సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయం ఎదుట గురువారం మే డే జెండాను టీఎస్ యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు పరకాల రవిందర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శులు ఆడెపు శివకుమార్, కొత్వాల్ ప్రవీణ్, కోటగిరి లక్ష్మణ్, గాలిపెల్లి సంతోష్ కుమార్, దాసరి చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణంలో గురువారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక సీపీఐ కార్యాలయం ఎదుట మేడే సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పార్టీ ఎర్రజెండాను ఎగరవేశారు. బహిరంగసభను నిర్వహించారు. ఏఐఎఫ్‌టీయూ(న్యూ)ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక శాంతినగర్ చౌరస్తాలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర నాయకుడు సోమిశెట్టి దశరథం జెండా ఆవిష్కరించి సభను నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం




మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు

సమీపంలోని లేబర్ అడ్డా వద్ద పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీలు అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పెద్దలింగాపూర్, అనంతారం, ఇల్లంతకుంట, పొత్తూరు, రేపాక తదితర గ్రామాలలో గురువారం ఘనంగా మేడే వేడుకలు జరిగాయి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నారం నర్సయ్య, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్య క్షుడు వరుకోలు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి చాతర్ల బాబు, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలత, మత్స్య పారిశ్రామిక సంఘ అధ్యక్షుడు రామచంద్రం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, కార్మిక సంఘం అధ్యక్షుడు భూంపెల్లి భూంరెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు గుంటి మహేష్, పసుల బాలరాజు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండలంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్, పార్థసారథి పంతులు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కొండల్‌రావు, పెయింటర్ అసోసియేషన్ అధ్యక్షుడు కడారి సత్యం, జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దోసల చంద్రం, నాయకులు దోసల ఉపేంద్ర, సింగిల్‌విండో డైరెక్టర్ మల్యాల రాజవీర్, ఎగదండి స్వామి, అభిలాష్, దోసల వికాస్, శంకర్, అనిల్ తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. రాజన్నపేటలో తాజా, మాజీ సర్పంచ్ ముక్క శంకర్ హమాలీ కార్మికులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పోతు రాజేశం, నర్సయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ : మే డే వేడుకలను వేములవాడలో కార్మిక సంఘాల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక గుమ్మి పుల్లయ్య భవన్‌లో నిర్వహించిన వేడుకల సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు జెండాను ఎగురవేశారు. అనంతరం స్థానిక పురపాలక సంఘం భవనం వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి జెండా ఎగురవేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి గాజుల పోశెట్టి, రూరల్ మండలం కార్యదర్శి శ్రీరాముల నర్సయ్య, ఎల్ల దేవరాజు, మున్సిపల్ నాయకులు పందుల మల్లేశం, నర్సయ్య, కె.వి.అనసూయ, పెంట గట్టవ్వ, పెంట భూమవ్వ, వాల్మీకి ఊర్మిల, సైకిల్ పుష్పలత, పెంట రాజవ్వ, పెంట నరేష్, పెంట మల్లేషం, బిగుళ్ల మల్లేశం, సుంకపాక పర్శరాం, కోరేపు క్రాంతి, కోరేపు శ్రీను, కల్లెపల్లి నర్సయ్య, పండుగ పోచమల్లు, చంద్రయ్య పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలో ఏఐటీయూసీ హమాలీ సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో చేనేత పవర్‌లో, కార్మిక భవన్‌లో జెండా ఆవిష్కరించి వేడుకలను జరుపుకున్నారు. పలు గ్రామాలతో పాటు బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్క్‌లో జెండా ఆవిష్కరించారు. మండల సీపీఐ అధ్యక్షుడు సోమ నాగరాజు, బచ్చుపల్లి శంకర్, పాతూరు సురేందర్ రెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ కోడూరు భాస్కర్‌గౌడ్, మాజీ సర్పంచ్ మాట్ల మధు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, కాంగ్రెస్ నాయకుడు మచ్చ శ్రీనివాస్, ఏట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆసరి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో మే డే ఉత్సావాలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ర్యాలీ తీశారు. జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, సొల్ల క్రాంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, ఎద్దండి నర్సింహరెడ్డి, సర్వర్‌పాషా, అఖిలపక్ష నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : కష్టజీవుల సమస్యలను పరిష్కరించి కార్మికుల బతుకులు వెలుగులు నింపాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్ బాబు అన్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించి సీపీఎం అరుణ పతాకాన్ని ఎగరవేశారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన టూరిస్టుల అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. మే 24న జరుగు సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లారపు అరుణ్ కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, సీఐటీయూ మండల అధ్యక్షుడు వెంకట్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్, నరేందర్, రాజేల్లయ్య పాల్గొన్నారు.

● చందుర్తి : మే డేను మండల కేంద్రంతో పాటు మూడపల్లి, బండపల్లి తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాలను ఆవిష్కరించారు. మల్యాల నర్సయ్య, సిరిగిరి కాంతయ్య, గట్టయ్య, మహేష్, మురళి, రవి, శ్రీనివాస్, మాజి ప్రజా ప్రతినిధులు చిలుక అంజబాబు, కట్కం మల్లేశం, నాయకలు నీరటి శ్రీనివాస్, లక్ష్మన్, శ్రీకాంత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, మండల అధ్యక్షురాలు జవాజి విమల, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.




గంభీరావుపేటలో మేడే ఉత్సవాలు..




ముస్తాబాద్‌లో మేడే ఉత్సావాలు



జిల్లెల్లలో మే డే వేడుకలు..



కోనరావుపేటలో వేడుకలు నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి

# ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరిసిల్లలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



వేములవాడ నందికమాన్ వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం..

సిరిసిల్ల రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): భారతదేశ వ్యాప్తంగా జన కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం బీజేపీ పట్టణ కమిటీ అధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, పట్టణ ప్రధానకార్యదర్శి ఎనగంటి నరేష్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, బీజేవైఎం ఉపాధ్యక్షుడు దూడం శివప్రసాద్, చొప్పదండి అంజన్న, ఊరగొండ రాజు, మోర శ్రీహరి, పంపరి అర్జున్, చొప్పదండి శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, ఇంజపురి మురళి, దుమాల శ్రీకాంత్, మహేషుని అనిల్, దూడం సురేష్, రాజలింగం, చొక్కి శ్రీను, సురేష్, గాలి శ్రీనివాస్ కర్నె రేవంత్, కోడం రవి, తాటిపాముల విష్ణు, వేముల పోశెట్టి, సాయిచంద్, తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గంట అశోక్, ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధులు దెవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, నాయకులు మల్లేశంయాదవ్, రమేష్, రాజుగౌడ్, దేవగౌడ్, సత్యనారాయణ, నాగరాజు తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండలకేంద్రంలో బీజేపీ నాయకులు పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. లక్ష్మారెడ్డి, బుగ్గారెడ్డి, నరేశ్, సంజీవరెడ్డి, అబ్దుల్లా, నర్సయ్య, గణేశ్, రాజిరెడ్డి, రవీందర్‌నాయక్, కిరణ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రంజిత్‌కుమార్, రాజు, రవి, కృష్ణహరి, వేణు, రాంరెడ్డి, స్రవంతి పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ మండల నందికమాన్ చౌరస్తా వద్ద పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్, చంద్రగిరి ప్రశాంత్, నర్సింగోజు శంకర్, జింక శ్రీనివాస్, ఎరుగొక్కుల రమేష్, బొల్లు తిరుపతి, కొలనూరి సంజీవ్‌రెడ్డి, ముడికే రాములు, శ్రీనివాస్, శ్రీనివాస్ ఉన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్, అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పోస్ శెట్టి రాకేష్, నాయకులు సిర్రం తిరుపతి, పెరుక గంగరాజు, పెరిక రంజిత్, లోకోజి సతీష్, మర్రి మల్లేశం, పత్తిపాక శ్రీనివాశ్, చిలుమల హన్మయ్యచారి, చింతకుంట గంగాధర్, మహిపాల్ రెడ్డి, మొత్కుపల్లి రాజశేఖర్, దళిత పాటి సుధాకర్, చింతకుంట సాగర్, తీపిరెడ్డి మనోహర్, తిరుపతి, కుసుంబ లింగరావు, గడిగొప్పుల జీవన్, పకిడి శ్రీకాంత్, తోట శంకర్, రాజు, తిప్పని భూమేష్, ముఖేశ్. లక్ష్మణ్ పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో ప్రధానమంత్రి మోదీ చిత్ర పటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, నాయకులు శంకర్, తిరుపతి, పర్శరాములు, మహేష్, జితేందర్ రెడ్డి, జలంధర్, పొన్నం మహేష్, విజయ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



గంభీరావుపేటలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

## రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరిసిల్లలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త కులగణన చేపట్టాలన్న ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమం విజయం సాధించిందని హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద వారి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్న డిమాండ్, రాష్ట్రంలో కులగణన చేపట్టి అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపించడం, డిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. మాజీ కౌన్సిలర్ వేముల రవి, కాంగ్రెస్ నాయకులు వెంగళ అశోక్,బొప్ప దేవయ్య, గుండ్లపెల్లి గౌతమ్, నీలి రవీందర్, గుజ్జె రమేష్, కమలాకర్‌రావు, శ్రీశైలం, యాదగిరి, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : దేశ వ్యాప్తంగా జన, కుల గణన నిర్వహించేందుకు కేంద్రం తీర్మాణించడం కాంగ్రెస్ విజయమేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలిసి గురువారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పాతబస్టాండు ప్రాంతంలో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాంరెడ్డి, బాలయ్య, చిన్నలక్ష్మీ,లక్ష్మారెడ్డి, గౌస్, బాబు, శ్రీనివాస్, కిషన్, భూమిరెడ్డి, మహేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : హన్మాజిపేటలో గురువారం రాహుల్‌గాంధీ సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు తీగల ఎల్లయ్య, జిల్లా సెక్రెటరీ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిలుక ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మ్యాక స్రవంతి హరినందన్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఇరువాల మల్లేశం, ఆదిల్ పాషా, చింతలపుడి రాజు, దశరథం, చంద్రం శ్రీనివాస్, జంకె సత్తయ్య, రాజు, భూమయ్య, ఎల్లయ్య, మల్లేశం, నారాయణ, కైలాసం, అనీల్, జావెద్. సంపత్, శారద పాల్గొన్నారు.

● చందుర్తి : కేంద్ర క్యాబినెట్ జన ఘనన, కుల గణన చేయాలని ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఇది ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ విజయంగా భావిస్తూ చందుర్తి మండల కాంగ్రెస్ నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చందుర్తి మండల కేంద్రంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పిటిసి సభ్యుడు నాగం కుమార్, ఏఎంసి వైస్ ఛైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు భీమరాజు కనకరాజు, ధర్మపురి శ్రీనివాస్, గోట్టే ప్రభాకర్, మ్యాకల గణేష్, పులి సత్తయ్య, దేవ స్వామి, బాలు, రవి, మధు, చంద్రం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.